క్లుప్తంగా

మృతుల కుటుంబాలకు పరిహారం


బాధిత కుటుంబాలకు పరిహార పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాడంగి: విద్యుత్‌షాక్‌తో మండలంలోని పూడి వలస గ్రామంలో మృతి చెందిన పి.అప్పలనాయుడు, బి.రామమూర్తి కుటుంబాలకు పరిహారం మంజూరైంది. ఉపాధి హామీ పథకం ద్వారా ఒక్కో బాధిత కుటుంబానికి రూ.50 వేలు మంజూరు కాగా వీటికి సంబంధించిన ధ్రువపత్రాలను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా మంగళవారం అందజేశారు. ప్రమాదం జరిగిన కొద్ది రోజుల్లోనే పరిహారం మంజూరు కావడం పట్ల బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

శాసనమండలి విప్‌కు సన్మానం


విక్రాంత్‌ను సన్మానిస్తున్న లక్ష్మీపురం గ్రామస్తులు

రేగిడి: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో శాసనమండలి విప్, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌ను సర్పంచ్ కెంబూరు వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ ఎర్నేన అప్పలనాయుడుతో పాటు గ్రామస్తులు మంగళవారం ఘనంగా సన్మానించారు. విప్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా గ్రామం వచ్చేసిన సందర్భంగా ఆయనను సత్కరించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ఘనంగా గ్రామదేవత సంబరాలు


వన్నలిలో ఆలయం వద్ద భక్తుల సందడి

రేగిడి: మండలంలోని వన్నలి, అక్కన్నఅగ్రహారం గ్రామాల్లో గ్రామదేవతల సంబరాలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. తొలుత అసిరితల్లి, కొండసూరమ్మ గ్రామదేవతల ఘటాలు ఊరేగించి, పూజలు చేశారు. మహిళలు అమ్మవార్లకు ముర్రాటలు సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు. సంబరాల్లో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రజలను విశేషంగా ఆకట్టుకున్నాయి.

ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తే చర్యలు

రామభద్రపురం: ట్రాఫిక్ అంతరాయం కలిగించే వాహన చోదకులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ తిరుమలరావు హెచ్చరించారు. మంగళవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌ఐ సురేంద్రనాయుడుతో కలిసి విలేకరులతో కలిసి మాట్లాడిన ఆయన మండల కేంద్రం అంతరాష్ట్ర కూడలి కావడంతో వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని, డ్రైవర్లు రోడ్డుపైనే ఆటోలు నిలపడం వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోందన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఎక్కువసేపు వాహనాలు నిలబెట్టడం వల్ల ప్రజలు, ఆర్టీసీ బస్సుల రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు తోడ్పడాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

రాజాం సిటీ: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిర్వహించిన ధర్నాలో పాల్గొన్న ఆయన తక్షణమే కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని, పట్టణ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. అలాగే రిస్క్ అలవెన్స్‌లు, భద్రతా సౌకర్యాలు సకాలంలో అందించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాసరావు, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ

బాడంగి: స్థానిక శాఖా గ్రంథాలయానికి మండల కేంద్రంలోని పెద్దవీధికి చెందిన టి.మణికంఠ మరికొంతమంది యువకులు కలిసి, పలు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలను మంగళవారం వితరణ చేశారు. పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగ యువతకు ఉపయోగపడుతుందన్న సదుద్దేశ్యంతో వీటిని అందజేసినట్లు దాతలు తెలిపారు. దాతలకు కృతజ్ఞతలని లైబ్రేరియన్ దుర్గాప్రసాద్ తెలిపారు.

పరీక్ష ఫలితాల విడుదల

రాజాం: దక్షిణభారత హిందీ ప్రచారసభ, మద్రాసు నిర్వహించిన హిందీ పరీక్షల ఫలితాలు విడుదలైనట్లు హిందీ ప్రచారక్ కె.మధుసూదనరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. స్థానిక పట్టణంలో ఆగస్టు నెలలో పరిచయ్, ప్రాథమిక, మధ్యమ, రాష్ట్ర భాష, ప్రవేశిక పరీక్షలు జరిగాయని, ఇప్పుడు వీటి ఫలితాలు విడుదల చేశారని పేర్కొన్నారు. ఫలితాల కోసం అభ్యర్థులు ఫోన్ నెంబర్ 9949917365ను సంప్రదించాలని కోరారు.

జగనన్న ఆరోగ్య సురక్ష.. జనులకు రక్ష!


రేగిడి: లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే జోగులు, ఎమ్మెల్సీ విక్రాంత్


వంగర: మద్దివలసలో వైద్య తనిఖీలు పరిశీలిస్తున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ, ఎంపీడీవో శశిభూషణరావు, తహసీల్దారు ఐజాక్


బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో మందుల కిట్లు పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ మురళీకృష్ణారావు


రేగిడి: లక్ష్మీపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రోగులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీస్తున్న ఎంపీ బెల్లాన చంద్రశేఖర్


రాజాం: కంచరాంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంబాల జోగులు


బొబ్బిలి: కమ్మవలసలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జనులకు రక్షగా నిలుస్తోంది. గ్రామగ్రామాన ఏర్పాటవుతున్న వైద్యశిబిరాలు ప్రజల ఆరోగ్యానికి భరోసానిస్తున్నాయి. మంగళవారం శిబిరాలకు హాజరైన రోగులకు వైద్యారోగ్య సిబ్బంది మెరుగైన వైద్యసేవలందించారు. ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాలు, మందులు పంపిణీ చేశారు. శస్త్రచికిత్స అవసరమైన వారిని జిల్లా కేంద్రాస్పత్రికి రిఫర్ చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్య భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తున్నారని, ఊరూరా అందుబాటులో ఉన్న ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజలను కోరారు.

–సాక్షి నెట్‌వర్క్


తెర్లాం: నందిగాంలో రోగులకు రక్తపరీక్షలు చేస్తున్న సిబ్బంది


రామభద్రపురం: రొంపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మందుల కిట్లు అందజేస్తున్న ఎంపీపీ లక్ష్మణరావు, జెడ్పీటీసీ సరస్వతి


బాడంగి: డొంకినవలసలో వైద్యసిబ్బందికి సూచనలిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



సంతకవిటి: కొండగూడేంలో నేత్రవైద్య తనిఖీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జోగులు, జెడ్పీ వైస్ చైర్మన్ జగన్‌మోహన్‌రావు

సామాన్యుడి ముఖంలో చిరునవ్వే జగనన్న లక్ష్యం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు


హొంజరాంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే జోగులుకు ఘనస్వాగతం పలుకుతున్న గ్రామస్తులు

సంతకవిటి: ప్రతీ సామాన్యుడి ముఖంలో చిరునవ్వు చూడడమే సీఎం జగనన్న లక్ష్యమని, ఆ దిశగా ఆయన అనేక సంక్షేమ పథకాలు, ప్రజలకు మేలు జరిగే కొత్త కొత్త కార్యక్రమాలు అమలుచేస్తున్నారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని హొంజరాం గ్రామంలో మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మంచిని వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు, ప్రభుత్వ సేవలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రాష్ట్రం, రాష్ట్ర ప్రజలు బాగుండాలన్నదే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తపని అని, దానికోసం ఆయన అహర్నిశలు శ్రమిస్తున్నారన్నారు. ఓ వైపు అభివృద్ధి పనులు చేపడుతూనే మరోవైపు అన్ని వర్గాల సంక్షేమం కోరుతూ అనేకానేక పథకాలు ప్రవేశపెట్టి, అమలుచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందని ఇల్లు లేదన్నారు. ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మంచిని చూసి, ఓర్వలేకనే ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. టీడీపీ హయాంలో పథకాలు కానీ అభివృద్ధి పనుల కాంట్రాక్టులు కానీ ఆ పార్టీకి చెందిన జన్మభూమి కమిటీలు చెబితే గానీ వచ్చేవికావన్నారు. ఇప్పుడు అలా లేదని, అర్హులైన ప్రతీ ఒక్కరికీ కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందజేయడం జరుగుతోందన్నారు. తన ఐదేళ్ల పాలనా కాలంలో మీకు మంచి జరిగితేనే ఓటు వేయండి అని అడిగే దమ్మూధైర్యం ఉన్న నాయకుడు జగనన్న ఒక్కరేనన్నారు. గతంలో ఎన్నికలప్పుడు ప్రజలకు ఎన్నో హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించిన నాయకులను, పార్టీలనే చూశామని, వైఎస్సార్ సీపీ, సీఎం జగనన్న అలా కాదని ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చడం జరిగిందన్నారు. సచివాలయాల ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతుందన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ ఇదే పార్టీని ఆశీర్వదించాలని, సీఎం జగన్‌ను మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్.జగన్‌మోహన్‌రావు, ఎంపీపీ ఎస్.మంజు, సర్పంచ్ క్రిష్ణవేణి, డీసీసీబీ మాజీ చైర్మన్ ఎస్.వెంకటరమణారావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ జి.స్వామినాయుడు, జేసీఎస్ కన్వీనర్ ఆర్.రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా అభివృద్ధి పనులు


రాజాం: రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ కృష్ణారావు

రామభద్రపురం: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మంజూరైన అభివృద్ధి పనులు మండలంలో చాలా చురుగ్గా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చొరవతో ప్రస్తుతం ఈ పనులు ఊపందుకోవడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. స్థానిక రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద జాతీయ రహదారిని ఆనుకుని కొత్తగా డ్రైనేజీ నిర్మాణంతో పాటు, గాలి గోపురం నుంచి ఆలయం వరకు కల్వర్టు కూడా నిర్మించడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రూ.8 లక్షల వ్యయంతో ఈ పనులు చేపట్టారు.

రాజాం: పట్టణంలోని తిరుమలనగర్‌లో రూ.9 లక్షల వ్యయంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు మంగళవారం చేపట్టారు. వీటిని మున్సిపల్ కమిషనర్ డీటీవీ కృష్ణారావు, వైఎస్సార్ సీపీ రాజాం టౌన్ కన్వీనర్ పి.శ్రీనివాసరావులు పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలపై ఆరాతీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటించిన ఎమ్మెల్యే కంబాల జోగులు దృష్టికి ప్రజలు తీసుకువచ్చిన సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే కాకుండా అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఏఈ పి.వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

నేడు బూరాడపేటలో గడప గడపకు..

సంతకవిటి: మండలంలోని హొంజరాం గ్రామ సచివాలయం పరిధిలోని బూరాడపేటలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జెడ్పీ వైస్ చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు ఓ ప్రకటనలో మంగళవారం వెల్లడించారు. ఉదయం జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులు పాల్గొంటారని, మండల స్థాయి పార్టీ నేతలు, కార్యకర్తలు, అధికారులంతా హాజరు కావాలని ఆయన కోరారు.

అభివృద్ధి, సంక్షేమంలో ఏపీ ముందంజ


చింతాడలో ప్రభుత్వ సంక్షేమ పాలనను వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బొబ్బిలి: అభివృద్ధి, సంక్షేమంలో ఆంధ్రప్రదేశ్(ఏపీ) రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅలప్పనాయుడు అన్నారు. మంగళవారం మండలంలోని చింతాడ గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వం ద్వారా ప్రజలకు జరుగుతున్న మేలును వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో ఆయన దృష్టికి గ్రామస్తులు తీసుకువచ్చిన పలు సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. ఎన్నికలకు సిద్ధమవుతున్న రాష్ట్రాలు మన రాష్ట్రంలో అమలయ్యే పథకాలను ఆధారంగా చేసుకుని, మేనిఫెస్టో రూపొందించుకుంటున్నాయని ఉదహరించారు. ప్రజాసంక్షేమమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన పథకాలు దేశానికే ఆదర్శమన్నారు. ప్రతీ వర్గానికి మేలు జరిగేలా ఆయన పథకాలు రూపొందించి, అమలుచేస్తున్నారన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలోని దాదాపు 99 శాతం హామీలు నెరవేర్చిన ఘనత కూడా ఆయనదేనన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే సులభంగా, ఉచితంగా ప్రభుత్వ సేవలు, వలంటీర్ వ్యవస్థ ద్వారా లబ్ధిదారుల వద్దకే పారదర్శకంగా పథకాలు అందిస్తున్న ఘనత కూడా ఆయనదేనన్నారు. ప్రతీ సచివాలయం పరిధిలో ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.20 లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు. ప్రజలకు మేలు చేస్తుండడం చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు జగనన్న సర్కారుపై లేనిపోని ఆరోపణలు చేస్తూ బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయని, వాటిని నమ్మవద్దన్నారు. రానున్న ఎన్నికల్లోనూ ఇదే పార్టీని గెలిపించాలని, మళ్లీ జగనన్ననే సీఎంని చేయాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ బి.తిరుపతిరావు, జెడ్పీటీసీ ఎస్.శాంతకుమారి, పార్టీ నేత ఎస్.వేణుగోపాలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

బొబ్బిలి: పట్టణంతో పాటు మండలంలోని గొల్లపల్లి, కలువరాయి, పిరిడి, బలిజిపేట, వంతరాం, జగన్నాథపురం, పెంట, పినపెంకి సబ్‌స్టేషన్ల పరిధిలోని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో బుధవారం అంతరాయం కలుగుతున్నట్లు విద్యుత్ శాఖ ఈఈ అనంతరావు ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. బొబ్బిలిలోని 33 కేవీ లైన్ మరమ్మతుల దృష్ట్యా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి, సహకరించాలని కోరారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి



సమావేశంలో పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: సీఎం జగన్‌మోహన్‌రెడ్డినే మళ్లీ మళ్లీ సీఎం కావాలని ప్రజలంతా కోరుకుంటున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు తెలిపారు. స్థానిక స్వామి కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన పార్టీ మండల విస్తృత స్థాయి సమావేశంలో పాల్గొన్న ఆయన పార్టీ శ్రేణులను దిశానిర్దేశం చేశారు. ప్రజాసమస్యల పరిష్కారంతో పాటు అభివృద్ధి పనులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ముఖ్య ఉద్దేశ్యంగా ప్రభుత్వం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకు తాము(ప్రజాప్రతినిధులు) వెళ్లినప్పుడు జగనన్న పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ప్రభుత్వ పనితీరు, పథకాలు, అభివృద్ధి పనులపై ప్రశంసలు కురిపిస్తున్నారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం ద్వారా చూకూరని లబ్ధి ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారా చేకూరిందని, జగనన్న రుణం ఎలా తీర్చుకోవాలని ప్రజలు అడుగుతున్నారన్నారు. అయితే మరుపు అనేది మానవ సహజం కావున నవంబరు 1వ తేదీ నుంచి చేపట్టబోయే వై ఏపీ నీడ్స్ జగన్(ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి) కార్యక్రమం ద్వారా ప్రభుత్వం ద్వారా ప్రజలకు కలిగిన మేలును ప్రతీ ఇంటికి వెళ్లి, వివరించాలని పార్టీ నేతలను కోరారు. దీనిలో సచివాలయ, జేసీఎస్ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, పార్టీ నేతలు, అభిమానులు భాగస్వాములు కావాలన్నారు. గతంలోని టీడీపీ పాలనకు ఇప్పటి వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న స్పష్టమైన తేడాను ప్రజలే గమనించేలా అవగాహన కల్పించాలన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ గెలుపే ధ్యేయంగా పార్టీ మరింత బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. పార్టీని నమ్ముకున్న వారికి అన్యాయం జరగదన్నారు. పార్టీని నమ్ముకుని ఉంటే ఎప్పటికైనా సముచిత గుర్తింపు లభిస్తుందన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ పి.రామారావు, ఎంపీపీ బి.గౌరి, పార్టీ తెర్లాం మండల అధ్యక్షుడు టి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

ఈ-శ్రమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఈ-శ్రమ్ పోర్టల్‌లో లబ్ధిదారుల పేర్ల నమోదుపై అవగాహన కల్పిస్తున్న అధికారి

రాజాం సిటీ: అసంఘటిత రంగ కార్మికులంతా ఈ-శ్రమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని సహాయ కార్మిక శాఖ అధికారి బి.కొండలరావు కోరారు. మంగళవారం మండలంలోని పొగిరి, శ్యాంపురం, పెనుబాక, బొద్దాం, సోపేరు గ్రామాల్లోని సచివాలయ సిబ్బందికి ఈ-శ్రమ్ పోర్టల్‌లో లబ్ధిదారుల పేర్ల నమోదుపై అవగాహన కల్పించారు. ఆయా సచివాలయాల పరిధిలోని అసంఘటిత రంగ కార్మికులందరినీ ఈ-శ్రమ్ పోర్టల్‌లో చేర్చాలని తెలిపారు. 18 నుంచి 60 ఏళ్ల వయసు వారంతా అర్హులని, ఈ పథకానికి అర్హులైన వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.2 లక్షలు, పాక్షిక అంగవైకల్యానికి గురైతే రూ.లక్ష బీమా వస్తుందన్నారు. క్లెయిమ్ నిమిత్తం 14434 నంబర్‌కు ఫోన్ చేయాలని, మరిన్ని వివరాలకు 9492555044 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలన్నారు.

తూటికాడ కషాయంతో దోమపోటు నివారణ


రాజాం: తూటికాడ కషాయం తయారీని వివరిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రాజాం: తూటికాడ కషాయంతో వరిలో వచ్చే సుడిదోమ, తెల్లదోమ తెగుళ్లతో పాటు దోమపోటు నివారణ సాధ్యమవుతుందని ప్రకృతి వ్యవసాయం ఎల్‌వన్ రమాదేవి అన్నారు. మంగళవారం మండలంలోని నందబలగ గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై అవగాహన కల్పించారు. 30 లీటర్ల ఆవుమూత్రంతో పాటు 20 కిలోల తూడికాడ ఆకులు సేకరించి, కషాయంగా తయారు చేసుకుని, పంటపై పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలు కె.లక్ష్మి, టి.అరుణ తదితరులు పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని చాటాయివలస గ్రామంలో తూటికాడ కషాయం తయారీపై మంగళవారం అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో కలిసి తొలుత తూటికాడ కషాయాన్ని తయారు చేసి, దాని ప్రయోజనాలను వివరించారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులు అవలంబించాలని, తూటికాడ కషాయంను వరిపంటలో పిచికారీ చేస్తే దోమపోటు, తెల్లదోమ, సుడిదోమ తెగుళ్ల నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ పి.తవిటినాయుడు తదితరులు పాల్గొన్నారు.